క్లుప్తంగా

కులపెద్దలపై అసభ్యకర పోస్టింగ్



హసన్‌పర్తి: కులపెద్దలపై వాట్సప్‌లో అసభ్యకర పోస్టింగ్ పెడుతూ మానసిక వేదనకు గురిచేస్తున్న నిందితుడు తాళ్లపల్లి వెంకటేశ్వర్లును కఠినంగా శిక్షించాలని జయగిరి గౌడ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కుల సంఘం సభ్యులు మూకుమ్మడిగా పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. గౌడ సంఘం ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

సీనియర్ న్యాయవాది జాఫర్ అహ్మద్ మృతి


జాఫర్ అహ్మద్ (ఫైల్)

వరంగల్ లీగల్: కాజీపేటలోని వెంకటాద్రినగర్‌కు చెందిన జిల్లా కోర్టు సీనియర్ న్యాయవాది సయ్యద్ జాఫర్ అహ్మద్ (69) మృతిచెందారు. ఇటీవల ఆయన కుటుంబ సమేతంగా సౌదీలోని మక్కా మసీదు దర్శనానికి వెళ్లారు. అక్కడ దర్గాను దర్శించుకుంటుండగా ఆయన ఆకస్మికంగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు అతడిని హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. రెండు రోజులపాటు చికిత్స పొందుతూ శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన సివిల్ కేసులు వాదించడంలో దిట్ట. మృతుడికి భార్య ఇంతియాజ్, కుమార్తె ఆఫ్సియా ఉన్నారు. అహ్మద్ మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే దొంతికి పరామర్శ



నర్సంపేట: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని ఆదివారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఎమ్మెల్యే మాతృమూర్తి దొంతి కాంతమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. హనుమకొండలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆమె మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే దొంతితోపాటు ఆయన సోదరులు రాంరెడ్డి, భగవాన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిని పరామర్శించారు. అలాగే, మంత్రి సీతక్క శనివారం అర్ధరాత్రి నివాళులర్పించారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీలు బలరాంనాయక్, కడియం కావ్య, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్‌నాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణవరదరాజేశ్వర్ రావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, డాక్టర్లు ఉప్పునూతుల సంపత్, సాగర్ పరామర్శించారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఖిలా వరంగల్: దాడి చేసి గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన పసునూటి రాజ్‌కుమార్, కందుల సాయితేజ స్నేహితులు. 2022లో పెళ్లి బరాత్‌లో తరుణ్ అనే వ్యక్తితో వీరు గొడవపడి పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో జైలుకు కూడా వెళ్లి వచ్చారు. రాజ్‌కుమార్ స్నేహితులను వదిలేసి తండ్రితో వ్యాపారం చేస్తున్నాడు. రాజ్‌కుమార్‌కు సాయితేజ్ పలుమార్లు కాల్‌చేసినా పట్టించుకోవటం లేదు. ఉర్సుగుట్ట వద్ద చేపట్టిన ఇంటి నిర్మాణం వద్దకు రాజ్‌కుమార్ వెళ్లి వస్తుండగా సాయితేజ్ గమనించి దుర్భాషలాడాడు. కత్తితో పొడవబోగా చేతికి గాయమైంది. స్నేహితులు రాజ్‌కుమార్‌ను శనివారం సాయంత్రం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. బాధితుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు సాయితేజ్‌పై ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్ తెలిపారు.

ఆకతాయిపై..

ఖిలా వరంగల్: ఓ మహిళ స్నానం చేస్తుండగా మొబైల్ ఫోన్‌లో వీడియో తీసిన ఆకతాయిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ స్నానం చేస్తుండగా అదే కాలనీకి చెందిన ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. అది గమనించిన సదరు మహిళ.. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆకతాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ బొల్ల రమేష్ ఆదివారం తెలిపారు.

'ప్రత్యేక' పాలనలో ఇబ్బందులు

ఐనవోలు : గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం ఐనవోలు మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య అన్నారు. మండల కేంద్రంలో మాదాసి ప్రభాకర్ అధ్యక్షతన పార్టీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి గ్రామాలు ప్రత్యేక అధికారుల పాలనలోకి వచ్చాయని ఆయన అన్నారు.

ప్రమాదకర జంక్షన్లు


జాతీయ రహదారిపై డివైడర్ లేని జంక్షన్


ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం


ఏర్పాటు చేయని సెంట్రల్ లైటింగ్

- జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు
- కానరాని సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ

హసన్‌పర్తి: యాదాద్రి – ఆరెపల్లి మార్గమధ్యలోని దేవన్నపేట – ఆరెపల్లి వరకు ఉన్న పలు జంక్షన్లు ప్రమాదకరంగా మారాయి. దేవన్నపేట, చింతగట్టు, ముచ్చర్ల, పెగడపల్లి, రెడ్డిపురం, వంగపహాడ్ జంక్షన్లలో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఆయా మార్గాల నుంచి వచ్చే వాహనాలు యూ టర్న్ తీసుకునే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొనడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏడాది కాలంలో ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగిన మరణించిన వారి సంఖ్య పదికి పైనే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అలాగే, కొంత మంది క్షతగాత్రుల సంఖ్య పోలీస్ రికార్డుల్లో నమోదు కాగా, మరికొంత మంది గాయపడినప్పటికీ పోలీస్‌స్టేషన్‌లో మాత్రం ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. రోడ్డు దాటుతూ ప్రమాదానికి గురై మరణించిన పశువుల సంఖ్య చాలానే ఉంటుంది.

కానరాని సెంట్రల్ లైటింగ్

జాతీయ రహదారి పనులు పూర్తై ఐదేళ్లు గడుస్తున్నప్పటికీ సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ఇంకా ఏర్పాటు చేయలేదు. దాంతో రాత్రివేళల్లో ఈ ప్రాంతం అంధకారంగా మారుతోంది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు ఈ మార్గంలో ప్రమాణించాలంటేనే భయపడుతున్నారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుపై అధికారులకు విజ్ఞప్తి చేసినా స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు.

వంతెనల నిర్మాణానికి భరోసా

వంగపహాడ్, ముచ్చర్ల వద్ద ఉన్న జంక్షన్ల ప్రాంతాల్లో వంతెనలు నిర్మిస్తామని అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు హామీ ఇచ్చారు. ఆ ప్రాంతాలను కూడా సందర్శించి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న తీరును పరిశీలించారు. అయినప్పటికీ ఇప్పటివరకు అతీగతి లేదు.

ప్రమాదాలను అరికట్టాలి



యాదాద్రి – ఆరెపల్లి జాతీయ రహదారి వంగపహాడ్ జంక్షన్ వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. బ్రిడ్జిలు నిర్మిస్తామని హామీ ఇచ్చి గత పాలకులు మరిచారు.

– ప్రసాద్, వంగపహాడ్

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి



దేవన్నపేట నుంచి ఆరెపల్లి వరకు జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి. రహదారిపై అంధకారం నెలకొనడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

– వెంకటేశ్వర్‌రెడ్డి, ముచ్చర్ల

మాజీ మంత్రి వెంకటస్వామికి నివాళి


వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏసీ శ్రీనివాస్‌రావు, తదితరులు

మామునూరు: మామునూరు టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ పరిపాలన భవనంలో కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు హాజరై వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, ఇన్‌స్పెక్టర్లు విజయ్, రవి, రాజ్‌కుమార్, కార్తీక్ పాల్గొన్నారు.

మినీ హాళ్లను అందుబాటులోకి తీసుకురావాలి

- కళాసాహిత్య స్వచ్ఛంద సంస్థల బాధ్యులు


సమావేశంలో కవులు, రచయితలు, తదితరులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ప్రధాన ఆడిటోరియానికి ఇరువైపులా ఉన్న మినీ హాళ్లను అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కళాసాహిత్య స్వచ్ఛంద సంస్థల బాధ్యులు కోరారు. ఈ మేరకు హనుమకొండలోని టీచర్స్ కాలనీ ఫేస్ –1 ప్రగతిమిత్ర కమ్యూనిటీ హాల్‌లో కళాసాహిత్య స్వచ్ఛంద సంస్థలు, కవులు, రచయితల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆడిటోరియంలో చిన్నచిన్న కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలులేదని, ఈ క్రమంలో మినీ హాళ్లల్లో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ప్రజాప్రతినిధులు, అధికారులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వాలని తీర్మానించారు. సమావేశంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, కళాసాహిత్య స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, కవులు, రచయితలు పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, నిధి, బిల్లా మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కవాతు


కాజీపేటలో కవాతు చేస్తున్న స్వయం సేవకులు


ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్ రోడ్డులో..

కాజీపేట: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కాజీపేట పట్టణ పుర వీధుల్లో స్వయం సేవకులు ఆదివారం కవాతు నిర్వహించారు. రైల్వే దేవాలయాల సముదాయంలోని రామాలయం నుంచి పథ సంచలనం ప్రారంభమై ప్రధాన రహదారి, విష్ణుపురి, రహమత్ నగర్ మీదుగా కొనసాగింది. పూర్తి గణవేశం (యూనిఫామ్) ధరించిన స్వయంసేవకులు క్రమపద్ధతిలో కవాతు చేశారు.

ఫోర్ట్‌రోడ్డులో ఆర్ఎస్ఎస్ కవాతు

ఖిలా వరంగల్: వరంగల్ ఏకశిలనగర్‌లోని సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో ఆర్ఎస్ఎస్ ఖిలా వరంగల్ శాఖ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ హాజరై వేడుకలను ప్రారంభించారు. ఖిలా వరంగల్ నుంచి సెంట్రల్ పబ్లిక్ స్కూల్ వరకు కర సేవకులు కవాతు నిర్వహించారు.

హోటళ్లలో నాణ్యత లేని ఆహార పదార్థాల విక్రయాలు

కాజీపేట: కాజీపేట పట్టణంతో పాటు సమీపంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న కొన్ని హోటళ్లలో పరిశుభ్రత, నాణ్యత లేకుండా ఆహార పదార్థాలను విక్రస్తూ ప్రజల ఆరోగ్యాలతో యజమానులు చెలగాటమాడుతున్నారు. ఫిర్యాదులొచ్చినప్పుడే అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేసి ఊరుకుంటున్నారు. తరాలపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మండల కేంద్రంలోని ఓ హోటల్‌లో ఆదివారం బిర్యాని తీసుకున్నారు. తినేందుకు యత్నించగా లోపల ఉన్న చికెన్ కుళ్లి ఉండటంతో హోటల్ యజమానితో వాగ్వాదానికి దిగడంతో వివాదం చోటుచేసుకుంది. బాటసారులు జోక్యం చేసుకుని సదరు బిర్యాని పాయింట్ నిర్వాహకుడితో డబ్బులు తిరిగి ఇప్పించడంతో గొడవ సద్దుమణిగింది. కొంతకాలంగా పలు హోటళ్లలో నాణ్యతపై పలుమార్లు వివాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి శుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించని నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం


అవార్డు అందుకుంటున్న సత్యప్రకాశ్‌రావు


లింగారావును సన్మానిస్తున్న వెలమ నాయకులు

విద్యారణ్యపురి: గురుబ్రహ్మ అవార్డును హనుమకొండకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కూరపాటి సత్యప్రకాశ్‌రావు అందుకున్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో గురుస్ స్టూడెంట్స్ అండ్ పేరెంట్స్ – ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గురుబ్రహ్మ అవార్డుల ప్రదానోత్సవంలో సత్యప్రకాశ్‌రావుకు సంస్థ వ్యవస్థాపకులు గంగారపు మల్లేశం, గంగారపు మనోహర్, అంజన్‌కుమార్, అంజిబాబు, జయంత్ కుమార్, కిరణ్ అవార్డు అందజేశారు. సత్యప్రకాశ్‌రావు అంకితభావంతో ఉపాధ్యాయ వృత్తిలో పనిచేస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇప్పటివరకు ఆయన 26 సార్లు రక్తదానం చేశారు.

ఉపాధ్యాయుడు లింగారావుకు సన్మానం

కాజీపేట అర్బన్: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కాజీపేట మండలం కడిపికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేట్ టీచర్ చుంచుకాల లింగారావును వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. హనుమకొండలోని వెలమ సంక్షేమ సంఘం భవన్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

14న వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: ఆటో, ట్రాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐసీటీయూ యూనియన్ నాయకులు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి కార్మికులు కదిలిరావాలని సూచించారు. ఓంకార్ భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో పలు సమస్యలపై నాయకులు చర్చించారు. ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో యూనియన్ల నాయకులు సలాం, ముక్కెర రామస్వామి, సుంచు జగదీశ్వర్, తాటికాయల రత్నం, మహబూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పరిరక్షణకు పోరాడాలి

హన్మకొండ: అమరుల స్ఫూర్తితో ఆర్టీసీ పరిరక్షణకు కార్మికులు మరో పోరాటానికి సిద్ధం కావాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాంచందర్ పిలుపునిచ్చారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలో అమరుల త్యాగాల దినోత్సవాన్ని ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల రక్షణ కోసం జరిగిన 54 రోజుల పోరాటంలో 34 మంది బలిదానాలు చేసుకున్నారని గుర్తు చేశారు. అయినా నియంత తరహా పాలకులు చలించలేదన్నారు. సమ్మె.. కార్మికుడి హక్కు అని, అలాంటి సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి రకరకాల ఎత్తుగడలు వేసినా బెదరకుండా, అదరకుండా అలుపెరగని పోరాటం చేసి దేశ చరిత్రలోనే చరిత్రాత్మక సమ్మె చేసిన ఘనత టీజీఎస్ ఆర్టీసీ కార్మికులది అని అన్నారు. కార్మిక వర్గం పిడికిలెత్తి ప్రభుత్వం మెడలు వంచి సాధించిన గొప్ప విజయమన్నారు. ఈ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల స్మరించుకుంటూ వారికి విప్లవాభివందనాలు తెలిపారు. వారి ప్రాణ త్యాగాలను స్మరించుకుంటూ మరో పోరాటానికి సేవ్ ఆర్టీసీ నినాదంతో సంఘాలకు అతీతంగా కదలిరావాలని పిలుపునిచ్చారు.

శిలాఫలకంతోనే సరిపెట్టారు!

- శంకుస్థాపన చేసి ఆరు నెలలైనా మొదలుకాని అభివృద్ధి పనులు
- అధ్వానంగా మచిలీబజార్ అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు



ధ్వంసమై అధ్వానంగా ఉన్న మచిలీబజార్‌లోని అంతర్గత రోడ్లు


మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంత

హన్మకొండ చౌరస్తా: ఎంతో ఆర్భాటంగా వేసిన శిలాఫలకం.. ప్రదర్శన వస్తువుగా మారిపోయింది. అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీల నిర్మాణం కోసం సుమారు రూ.27 లక్షల నిధులు మంజూరు కాగా, అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి సుమారు ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ పనులు ప్రారంభం కాకపోవడం విశేషం. ఆర్భాటం తప్ప ఆచరణ లేని అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇక్కట్లు పడుతున్న ప్రజలు

హనుమకొండ 10వ డివిజన్ పరిధి మచిలీబజార్‌లో (మారెమ్మ గుడి సమీపంలో) అంతర్గత రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయి. సైడ్ డ్రెయినేజీలు సైతం శిథిలావస్థకు చేరడంతో మురుగు నీరు ముందుకు వెళ్లక స్థానికులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజల ఇబ్బందులు మాటల్లో చెప్పలేనివి.

అధికారుల నిర్లక్ష్యం

దశాబ్దాల కాలం క్రితం వేసిన రోడ్లు ధ్వంసమయ్యాయని, అప్పటి మురుగు కాల్వలు కూరుకపోయాయని, నూతన రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని అనేకసార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల వద్ద కాలనీవాసులు మొరపెట్టుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పందించి రూ.27 లక్షలు మంజూరు చేసి ఆరు నెలల క్రితం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. త్వరతగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు.

పట్టించుకోవడం లేదు



సుమారు ఆరు నెలల క్రితం మున్సిపల్ అధికారులతో కలిసి రోడ్డు, డ్రెయినేజీ పనులకు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు ఆ పనులు మొదలు కాలేదు. పనులెందుకు చేయడం లేదని అధికారులు, ప్రజాప్రతినిధులను స్థానికులు అనేక సార్లు అడిగినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలి.

– ఆకుల గోపి, మచిలీబజార్

వర్షాకాలంలో ఇబ్బందులు



పదిహేనేళ్ల క్రితం వేసిన రోడ్లు పగుళ్లు, గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. డ్రెయినేజీలు అధ్వానంగా తయారయ్యాయి. వర్షాకాలంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గుంతల రోడ్లపై వరద నిలుస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీలు నిర్మించాలి.

– కొంపెల్లి రాజేష్, మచిలీబజార్

నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్




శంకుస్థాపన చేసిన నాటి నుంచి పనులు మొదలు పెట్టాలని కాంట్రాక్టర్‌కు ప్రతి రోజు గుర్తు చేస్తున్నాను. గల్లీ చిన్నగా ఉంది, మిల్లర్ లోపలికి వెళ్లడం కష్టమని చెబుతున్నాడు. పని చేయడం ఇబ్బందిగా ఉంటే టెండర్ రద్దు చేసుకుంటే, మరో కాంట్రాక్టర్ పనులు చేస్తాడని చెబితే వినిపించుకోవడం లేదు. సదరు కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని బల్దియా కమిషనర్‌ను కోరుతా.

– తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్, 10వ డివిజన్

ప్రమాదకరంగా ఎస్సారెస్పీ వంతెన


తెగిన బ్రిడ్జి


కుంగిన వంతెన


ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి


మొరం ట్రాక్టర్

- మునిపల్లి – జయగిరి మధ్య కాల్వపై పొంచి ఉన్న ప్రమాదం
- అయినా బ్రిడ్జిపై నుంచి ఆగని మొరం ట్రాక్టర్ల రాకపోకలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

హసన్‌పర్తి: మునిపల్లి – జయగిరి మార్గమధ్యలోని ఎస్సారెస్పీ బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన ఎప్పుడు కూలుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ వంతెన పలు చోట్ల తెగిపోవడమే కాకుండా మరికొన్ని ప్రాంతాల్లో దెబ్బతిన్నది. ఎస్సారెస్పీ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా మునిపల్లి – జయగిరి మార్గమధ్య ప్రధాన కాల్వపై బ్రిడ్జి నిర్మించారు. రైతులు, వాహనదారులు ఈ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

మొరం ట్రాక్టర్ల రాకపోకలు

ఈ మార్గంలో ఎక్కువశాతం అక్రమ మొరం, కంకర లోడ్ ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. మొరం అక్రమ వ్యాపారులు ఈ వంతెనను అందుకు వినియోగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటు బ్రిడ్జిపై అధికారుల పర్యవేక్షణ కొరవడడం.. అటు ట్రాక్టర్ల తాకిడి కారణంగా వంతెన దెబ్బతిన్నది. ట్రాక్టర్ల రాకపోకలతో వంతెన ఎప్పుడు కూలిపోతోందనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ బ్రిడ్జి కూలితే ప్రాణ హాని సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, రెండు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించే అవకాశం ఉందని అంటున్నారు.

పట్టించుకోని అధికారులు

ఎస్సారెస్పీ కాల్వలపై అధికారుల పర్యవేక్షణ కొరవడినట్లు రైతులు తెలిపారు. ప్రతీసారి నీటి విడుదల చేసినప్పుడు ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ వెంట అధికారులు తిరుగుతూ పర్యవేక్షించాల్సి ఉంది. వంతెన పలు చోట్ల తెగినా అధికారులు స్పందించకపోవడానికి పర్యవేక్షణ లోపమేకారణంగా పలువురు పేర్కొంటున్నారు. నిత్యం వందలాది మొరం, కంకర అక్రమ ట్రాక్టర్లు రాకపోకలు ఈ మార్గంలో నుంచి సాగిస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

9న జాతీయ బృంద గీతాల పోటీలు

విద్యారణ్యపురి: భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) ఓరుగల్లు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 9న వరంగల్ దేశాయిపేట రోడ్డులోని నాగార్జున ప్రైమ్ స్కూల్‌లో పాఠశాలల జాతీయ బృంద గీతాల పోటీలు నిర్వహించనున్నట్లు బీవీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు రెండు గ్రూపులుగా ఏర్పడి ఒక గ్రూపు హిందీ, సంస్కృతం పాటలు, రెండో గ్రూప్ ప్రాంతీయ భాషా గీతాలు, జానపద గీతాలు పాడవచ్చని పేర్కొన్నారు. ఒకే గ్రూపు రెండు విభాగాల్లోనూ పాల్గొనే అవకాశం ఉందని, ఒక్కో గ్రూపులో 8మంది విద్యార్థులు ఉండాలని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈనెల 12న హైదరాబాద్‌లో జరగబోయే బీవీపీ రాష్ట్ర స్థాయి జాతీయ బృంద గీతాల పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నట్లు వారు వివరించారు.